

అనకాపల్లి జిల్లాలో ఇద్దరు అభ్యర్థులు ప్రకటన

- నర్సీపట్నం నుంచి అయ్యన్నపాత్రుడు
- పాయకరావుపేటకు వంగలపూడి అనిత
- పొత్తులో భాగంగా అనకాపల్లి సీటు జనసేనకు కేటాయింపు



చింతకాయల అయ్యన్నపాత్రుడు



వంగలపూడి అనిత

అనకాపల్లి, నర్సీపట్నం, పాయకరావుపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలో మూడు అసెంబ్లీ స్థానాలకు తెలుగుదేశం పార్టీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులు ఖరారయ్యారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలు (ఆరు పూర్తిగా, ఒకటి (పెందుర్తి) పాక్షికంగా) ఉండగా, అనకాపల్లి, నర్సీపట్నం, పాయకరావుపేట అసెంబ్లీ స్థానాలకు శనివారం అభ్యర్థులను ప్రకటించారు. నర్సీపట్నం అభ్యర్థిగా మాజీ మంత్రి, సీనియర్ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడు, పాయకరావుపేట (ఎస్సీ) స్థానానికి తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, అనకాపల్లి స్థానానికి జనసేన అభ్యర్థిగా మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ పేర్లు ఖరారయ్యాయి. జిల్లాలో చోడవరం, ఎలమంచిలి, మాడుగుల, పెందుర్తి స్థానాలకు టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది.

పదోసారి అసెంబ్లీ ఎన్నికల బరిలోకి అయ్యన్న

అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజకవర్గం నుంచి చింతకాయల అయ్యన్నపాత్రుడు మరోమారు ఎన్నికల బరిలో దిగనున్నారు. ఆయన ఇప్పటివరకు తొమ్మిదిసార్లు అసెంబ్లీకి, ఒకసారి అనకాపల్లి నుంచి పార్లమెంటుకు పోటీ చేశారు. పదోసారి నర్సీపట్నం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. అయ్యన్నపాత్రుడు 1983లో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసి సమీప కాంగ్రెస్ అభ్యర్థి రాజసాగి రామచంద్రరాజుపై గెలుపొందారు. ఆ తరువాత 1985, 1989, 1994, 1999, 2004, 2009, 2014, 2019 ఎన్నికల్లో అసెంబ్లీకి పోటీ చేశారు వైసీపీ అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేశ్ చేతిలో ఓటమి చెందారు. ఆరుసార్లు గెలుపొందారు. ఎన్టీఆర్ క్యాబినెట్‌లో 29 ఏళ్ల వయస్సులో మంత్రిగా పనిచేసే అవకాశం అయ్యన్నకు దక్కింది. 1985-87లో సాంకేతిక విద్యా శాఖ మంత్రిగా, 1994-96 ఆర్ అండ్ బీ మంత్రిగా, 1999 నుంచి 2004 వరకు అటవీశాఖా మంత్రి, 2014-17 పంచాయతీరాజ్ శాఖా మంత్రిగా, 2017-19 వరకు ఆర్ అండ్ బీ మంత్రిగా పనిచేశారు. 1996లో అనకాపల్లి ఎంపీగా ఉన్న పెతకంశెట్టి అప్పలనరసింహం మృతిచెందడంతో జరిగిన ఉప ఎన్నికల్లో అయ్యన్నపాత్రుడు పోటీ చేసి విజయం సాధించారు.

పేట నుంచి అనిత

పాయకరావుపేట నియోజకవర్గ అభ్యర్థిగా వంగలపూడి అనితను టీడీపీ అధిష్ఠానం ప్రకటించింది. ఆమె మొదటిసారి 2014 ఎన్నికల్లో పాయకరావుపేట నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2019లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరులో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తరువాత ఆమెను పాయకరావుపేట ఇన్‌చార్జిగా అధిష్ఠానం నియమించడంతో అప్పటి నుంచి పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటూ కార్యక్రమాలను సమర్థంగా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలిగా కూడా ఉన్నారు. అనితకు పార్టీ అధిష్ఠానం టికెట్ కేటాయించడంతో పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు.

అనకాపల్లి జనసేన అభ్యర్థిగా కొణతాల



అనకాపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కొణతాల రామకృష్ణకు జనసేన పార్టీ అనకాపల్లి అసెంబ్లీ స్థానం కేటాయించింది. కొణతాలకు అభ్యర్థిత్వం ఖరారు కావడంతో ఆయన వర్గీయులు శనివారం అనకాపల్లి నెహ్రూచౌక్‌లో బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. గవర సామాజిక వర్గానికి చెందిన కొణతాల రామకృష్ణ 1989 నుంచి 1996 వరకు అనకాపల్లి పార్లమెంట్ సభ్యుడిగా పనిచేశారు. 1991-96 మధ్య ఏపీ పార్లమెంటు సభ్యుల కన్వీనర్‌గా పనిచేశారు. 1999లో అనకాపల్లి అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి ఓటమి పాలైన కొణతాల...2004 ఎన్నికల్లో గెలిచి అప్పటి సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మంత్రివర్గంలో వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, న్యాయ తదితర శాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 2009 ఎన్నికల్లో అనకాపల్లి నుంచి మరోసారి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం వైఎస్‌ఆర్ సీపీలో చేరారు. పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ చైర్మన్‌గా ... మిగతా 8వ పేజీలో

విశాఖ జిల్లాలో ఇద్దరి పేర్లు ఖరారు

- 'తూర్పు' నుంచి వెలగపూడి, 'పశ్చిమ' నుంచి గణబాబు...మరోసారి పోటీ
- మరో 5 సీట్లు పెండింగ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం శనివారం విడుదల చేసిన తొలి జాబితాలో జిల్లా నుంచి ఇద్దరు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మాత్రమే అవకాశం దక్కింది. విశాఖ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వెలగపూడి రామకృష్ణబాబు, పెతకంశెట్టి గణబాబులకు టికెట్లు కేటాయించారు. తొలి జాబితాలో సీట్లు దక్కించుకున్న వెలగపూడి రామకృష్ణబాబు, పెతకంశెట్టి గణబాబు ఇద్దరూ సీనియర్లే. ఒక్కొక్కరు మూడు పర్యాయాలు తెలుగుదేశం నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. గణబాబు ఇప్పటివరకూ నాలుగు పర్యాయాలు ... మిగతా 8వ పేజీలో

తొలి జాబితాలోనే దొన్నుదొరకు చోటు

ఖరారు చేసిన టీడీపీ అధిష్ఠానం

- అరకులోయ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో నలుగురు ఎమ్మెల్యే అభ్యర్థులు ఖరారు
- రెండో జాబితాలో పాడేరు అసెంబ్లీ అభ్యర్థిని ప్రకటించే అవకాశం



అరకులోయలో దొన్నుదొరకు మిఠాయి తినిపించి సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

మన్యంలో అరకులోయ అసెంబ్లీ స్థానం తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా సియ్యారి దొన్నుదొరను ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఏజెన్సీలో మరో అసెంబ్లీ స్థానమైన పాడేరు పెండింగ్‌లో పెట్టారు. రెండో జాబితాలో పాడేరు అభ్యర్థిని ప్రకటిస్తారని తెలుస్తున్నది. కాగా అరకులోయ పార్లమెంట్ స్థానం పరిధిలో మొత్తం ఏడు అసెంబ్లీ స్థానాలకు గాను నాలుగు స్థానాలకు అభ్యర్థులను టీడీపీ ఖరారు చేసింది.



సియ్యారి దొన్నుదొర

రా... కదలిరా సభలోనే అరకులోయ అభ్యర్థి ప్రకటన

అరకులోయలో గత నెల 20న నిర్వహించిన తెలుగుదేశం పిలుస్తుంది... రా కదలిరా బహిరంగ సభలోనే టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు.. అరకులోయ అభ్యర్థి దొన్నుదొరే అని ప్రకటించారు. దానిని శనివారం టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థుల ప్రకటన నేపథ్యంలో ఖరారు చేశారు. ఉపాధ్యాయుడిగా పని చేసిన దొన్నుదొర రాజకీయాలపై ఆసక్తితో పదేళ్ల క్రితమే ఉద్యోగాన్ని వదిలి రాజకీయాల్లో చేరారు. గతంలో వైసీపీ అరకులోయ సమన్వయకర్తగా పని చేసిన ఆయనకు ఆఖరు నిమిషంలో టికెట్ దక్కకపోవడంతో ఆ పార్టీని వీడారు. 2019లో వైసీపీ రెబల్ అభ్యర్థిగా బరిలో దిగి 20 వేలు పైచిలుకు ఓట్లు సంపాదించి తన సత్తాచాటారు. ఆ తరువాత ఆయన తెలుగుదేశం పార్టీలో చేరడంతో ఆయనను తెలుగుదేశం పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించింది. దీంతో టీడీపీ నేతగా గత ఐదేళ్లుగా నియోజకవర్గంలోని అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు (ఆరు)మండలాల్లో విస్తృతంగా పర్యటించి పార్టీ బలోపేతానికి, తన వ్యక్తిగత రాజకీయ జీవితానికి గట్టి పునాది వేసుకున్నారు. అలాగే సామాజిక సమీకరణల పరంగాను ఆయన బలమైన కొండదొర సామాజికవర్గం కావడంతో గతేడాదే అరకులోయ అసెంబ్లీ ఇన్‌చార్జిగా తెలుగుదేశం పార్టీ నియమించిన విషయం తెలిసిందే.

పెండింగ్‌లో పాడేరు అసెంబ్లీ స్థానం

పాడేరు అసెంబ్లీ స్థానానికి తొలి జాబితాలోనే టీడీపీ అభ్యర్థిని ప్రకటిస్తారని అందరూ భావించినప్పటికీ ... మిగతా 8వ పేజీలో

అధినేత నమ్మకాన్ని నిలబెడతా..

నాకు అరకులోయ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించిన టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు నమ్మకాన్ని నిలబెడతానని మరోమారు కృతజ్ఞతలు తెలుపుతూ చెబుతున్నాను. భారీ మెజార్టీలో అరకులోయ ఎమ్మెల్యేగా గెలిచి చంద్రబాబునాయుడికి బహుమతిగా అందిస్తాను. రా..కదలిరా సభలోనే నన్ను అభ్యర్థిగా ప్రకటించారు. అలాగే తొలి జాబితాలోనే నా అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయడం ఎంతో ఆనందంగా ఉంది. మా నియోజకవర్గం ప్రజలు సైతం తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. రానున్న ఎన్నికల్లో అరకులోయలో టీడీపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నాను. నాకు టికెట్ వచ్చేందుకు కృషి చేసిన పార్టీ పెద్దలు, నేతలు, కార్యకర్తలు, అభిమానులకు ధన్యవాదాలు తెలుపుకొంటున్నాను.

- సియ్యారి దొన్నుదొర, అరకులోయ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి

ఆరోగ్య సహాయకుల ఆకలి కేకలు

- ఏజెన్సీలోని 35 పీహెచ్‌సీల్లో 174 మంది హెల్త్ అసిస్టెంట్లు
- సకాలంలో జీతాలు అందక ఆర్థిక ఇబ్బందులతో సతమతం

ఇంకా అందని జనవరి జీతాలు

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎప్పుడు జీతాలు అందుతాయో తెలియని పరిస్థితి ఉందని ప్రభుత్వ ఉద్యోగులు వాపోతున్నారు. నెలలో మొదటి లేదా రెండో వారంలో కొందరికి జీతాలు అందుతుండగా, ఏజెన్సీలోని పని చేస్తున్న కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్లకు ఇప్పటికీ జనవరి నెల జీతాలు అందలేదు. దీంతో మన్యంలోని హెల్త్ అసిస్టెంట్లు ఆర్థికపరమైన ఇబ్బందులతో సతమతమవున్నారు.



విద్యాలయంలో సేవలు అందిస్తున్న హెల్త్ అసిస్టెంట్

ఏజెన్సీ 11 మండలాల్లోని 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 174 మంది కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్లు పని చేస్తున్నారు. వారంతా నిత్యం గ్రామాలను సందర్శిస్తూ జ్వర బాధితులు, రోగులను గుర్తించి వారికి అవసరమైన రక్త పరీక్షలు, వైద్య సేవలు, మందుల పంపిణీ చేస్తుంటారు. అలాగే విద్యాలయాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి అక్కడ సిబ్బంది, విద్యార్థులకు అవసరమైన వైద్య పరీక్షలు చేసి వైద్య సేవలు అందిస్తారు. క్షేత్ర స్థాయిలో వైద్య ఆరోగ్యశాఖకు వెన్నుముకగా ఉండే హెల్త్ అసిస్టెంట్లకు ఇన్నాళ్లు ప్రతి నెలా మొదటి వారంలో జీతాలు అందకపోవడంతో పలు రకాల సమస్యలను ఎదుర్కొంటున్నారు. కుటుంబ పోషణతో పాటు పలు బ్యాంకు రుణాలకు సంబంధించిన ఈఎంఐలు సకాలంలో చెల్లించలేక సిబిల్ స్కోర్ తగ్గడం వంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని గిరిజన కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్ల సంఘం నేత శెట్టి నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు రాష్ట్ర స్థాయి కార్యాలయాల నుంచి సీఎఫ్ఎంఎస్ ద్వారా వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ అవుతుండడంతో వీరి జీతాలు ఎప్పుడు అందుతాయనేది జిల్లా స్థాయి వైద్య ఆరోగ్యశాఖాధికారులు సైతం చెప్పలేని పరిస్థితి కొనసాగుతున్నది. దీంతో తమ జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియక వాటి కోసం నిరీక్షిస్తూ ఆందోళన చెందుతున్నామని హెల్త్ అసిస్టెంట్లు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు జీతాలు చెల్లించాలని బాధిత హెల్త్ అసిస్టెంట్లు డిమాండ్ చేస్తున్నారు.



గ్రామాల్లో రోగికి రక్త నమూనా తీస్తున్న హెల్త్ అసిస్టెంట్

28న నారా భువనేశ్వరి బహిరంగ సభ



- ఆడారిమెట్ట వద్ద నిర్వహణ
- ఏర్పాట్లను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి



పాడేరు మండలం ఆడారిమెట్ట వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

పాడేరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా ఈ నెల 28న నారా భువనేశ్వరి బహిరంగ సభను మండలంలోని ఆడారిమెట్ట వద్ద నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి తెలిపారు. ఈ మేరకు మండలంలోని చింతలవీధి పంచాయతీ ఆడారిమెట్ట వద్ద ఖాళీగా వున్న స్థలాన్ని శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ నారా చంద్రబాబునాయుడి అక్రమ అరెస్టు నేపథ్యంలో ఆవేదనతో జి.మాడుగుల మండలంలో ప్రాణాలు కోల్పోయిన పార్టీ కార్యకర్తల కుటుంబాలను కూడా నారా భువనేశ్వరి పరామర్శిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోడా వెంకటసురేశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం పనులు వేగవంతం

ఆశ్రమ పాఠశాల విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి

- గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ జేవీ మురళి
- లంబసింగి ఉపాధ్యాయురాలికి షోకాజు నోటీసు
- డౌనూరు సోషల్ ఉపాధ్యాయుడు సస్పెండ్



మ్యూజియం నిర్మాణాన్ని డైరెక్టర్ మురళికి వివరిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

చింతపల్లి/కొయ్యూరు, ఫిబ్రవరి 24: లంబసింగిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న స్వాతంత్ర్య సమరయోధులు మ్యూజియం నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఏపీ గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ జేవీ మురళి ఆదేశించారు. శుక్రవారం రాత్రి లంబసింగి చేరుకున్న ఆయన శనివారం ఉదయం చెరువులవేనం వ్యూపాయింట్‌ను సందర్శించారు. నిర్మాణంలో ఉన్న వ్యూపాయింట్, మరుగుదొడ్లను ఆయన పరిశీలించారు. చెరువులవేనంకి వస్తున్న పర్యాటకులు, అందుబాటులో ఉన్న సదుపాయాలను గిరిజన సంక్షేమశాఖ ఈఈ డీవీఆర్ఎం రాజును అడిగి తెలుసుకున్నారు. అక్కడ నుంచి పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్‌తో కలిసి తాజంగి-లంబసింగి మార్గంలో నిర్మాణంలో ఉన్న స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం వద్దకు చేరుకున్నారు. మ్యూజియం నిర్మాణాలకు సంబంధించిన నమూనాలను గిరిజన సంక్షేమ శాఖ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరావు వివరించారు. నిర్మాణంలో ఉన్న హట్ బజార్, యాంపీ థియేటర్, ఇతర భవనాలను ఆయన పరిశీలించారు. మ్యూజియం నిర్మాణాలు ఆలస్యంగా జరుగుతున్నాయని ఆయన అసహనం వ్యక్తం చేశారు. నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం కొమ్మంగి-ఉరిసింగి రహదారి నిర్మాణాలను పరిశీలించారు. నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

లంబసింగి టీచర్‌కు షోకాజు, డౌనూరు ఉపాధ్యాయుడు సస్పెండ్

గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ జేవీ మురళి తన పర్యటనలో భాగంగా లంబసింగి(బాలికలు), డౌనూరు(బాలుర) గిరిజన సంక్షేమశాఖ పాఠశాలలను తనిఖీ చేశారు. తొలుత విద్యార్థులకు అందుబాటులో ఉన్న సదుపాయాలు, భోజనాలను పరిశీలించారు. లంబసింగి బాలికల పాఠశాలలో విద్యార్థినులను సోషల్ పాఠ్యాంశంలో పలు ప్రశ్నలు అడిగారు. విద్యార్థినులు ఏ ఒక్కరు సరైన సమాధానం చెప్పలేకపోయారు. విద్యార్థినులు వివిధ రాష్ట్రాలను మ్యాప్‌లో గుర్తించలేకపోయారు. అలాగే సోషల్ ఉపాధ్యాయురాలు మ్యాప్‌లో జమ్ముకశ్మీర్‌ను గుర్తించలేకపోవడంతో డైరెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో ఆమెకు షోకాజు నోటీసు ... మిగతా 8వ పేజీలో

మహిళలు మరింత పురోగతి సాధించాలి

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం, చిత్రంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఉన్నారు

- వార్త 7వ పేజీలో..

దట్టంగా పొగమంచు



పాడేరు అంబేడ్కర్ సెంటర్‌లో శనివారం ఉదయం పొగమంచు

పాడేరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పాడేరులో దాదాపు పది రోజుల తరువాత శనివారం పొగమంచు కమ్ముకున్నది. తెల్లవారుజాము నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు పాడేరు, పరిసర ప్రాంతాల్లో పొగమంచు దట్టంగా అలుముకుంది. దీంతో వాహనాలు సైతం లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాయి.

అరకులోయలో 14.1 డిగ్రీలు

మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతున్నాయి. అరకులోయలో 14.1, ముంచంగిపుట్టులో 14.6, పెదబయలులో 15.7, జి.మాడుగులలో 15.8, అనంతగిరిలో 16.1, పాడేరులో 16.5, హుకుంపేటలో 17.5 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు శనివారం నమోదయ్యాయి.

- మన్యంలో పెరుగుతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు

చింతపల్లిలో..

చింతపల్లి: మండలంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు మళ్లీ పెరిగాయి. శనివారం చింతపల్లిలో 16 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు.

జి.మాడుగులలో...

జి.మాడుగుల: మండలంలో పొగమంచు కొనసాగుతోంది. ఉదయం 8 గంటల వరకు మంచు తెరలు వీడలేదు. కనిష్ఠ ఉష్ణోగ్రతలు కాస్త పెరగడంతో చలి తీవ్రత తగ్గింది.

క్రైం... crime news

నాలుగు వాహనాలు ఢీ

» నుజ్జునుజ్జయి » ముగ్గురుకి గాయాలు



రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన వాహనాలు

పాయకరావుపేట, ఫిబ్రవరి 24: స్థానిక వై జంక్షన్ వద్ద శనివారం నాలుగు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. వాహనాలన్నీ నుజ్జునుజ్జయ్యాయి. ఇందుకు సంబంధించి 108 వాహనం సిబ్బంది శ్రీనివాస్, సంతోష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శనివారం ఉదయం స్థానిక వై జంక్షన్ వద్ద సిగ్నల్ పాయింటు దాటిన తరువాత విశాఖ నుంచి విజయవాడ వైపు వెళుతున్న లారీ అదుపుతప్పి ముందు వెళుతున్న ప్రైవేటు బస్సు వెనుక భాగాన్ని ఢీకొట్టడంతో పక్కకు వెళ్లిపోయింది. అయినా లారీ ఆగకుండా ముందు వెళుతున్న మరో కారును కూడా బలంగా ఢీకొట్టింది. దీంతో కారు ముందు వెళుతున్న వ్యాన్‌ని ఢీకొట్టింది. నాలుగు వాహనాలకు ఢీకొన్న సంఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులకు గాయాలు కాగా.. బస్సు వెనుక భాగం దెబ్బతింది. అదేవిధంగా కారు, లారీ ముందుభాగం నుజ్జునుజ్జయ్యాయి. నివాసితులు ఇచ్చిన సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తుని ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు 108 సిబ్బంది తెలిపారు. ప్రమాదంపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పది కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

నాతవరం, ఫిబ్రవరి 24: గంజాయిని తరలిస్తున్న ఇద్దర్ని శనివారం పట్టుకుని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ రామారావు తెలిపారు. కేరళ రాష్ట్రానికి చెందిన అఖిల్ శివన్, మోహన్‌దాస్‌లు ఒడిశా నుంచి ధారకొండ మీదుగా పది కిలోల గంజాయితో వెళుతుండగా, నాతవరం మండలం డి.యర్రవరం వద్ద పట్టుకున్నామన్నారు. అనంతరం అరెస్టు చేసి, కోర్టుకు తరలించినట్టు చెప్పారు.

నలుగురిపై అట్రాసిటీ కేసు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 24: మరిడిమాంబ జాతరలో కొట్టి కులం పేరుతో దూషించారని శ్రీరామనగర్‌కాలనీకి చెందిన వడ్డాది దుర్గాప్రసాద్ శుక్రవారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ పోలీసులు తెలిపారు. శ్రీరామనగర్‌కాలనీకి చెందిన దుర్గాప్రసాద్ అతని స్నేహితుడు శ్రీధర్ కలిసి గురువారం రాత్రి విజయరామరాజుపేటలోని కృష్ణమందిరం వద్ద జరిగిన స్టేజి కార్యక్రమానికి వెళ్లారని తెలిపారు. అక్కడ వీరిద్దరూ డాన్స్ బేబి డాన్స్ కార్యక్రమం చూస్తూ డాన్సులు వేస్తుండగా విజయరామరాజుపేట ప్రాంతానికి చెందిన లచ్చా, మరో ముగ్గురు దుర్గాప్రసాద్, శ్రీధర్‌తో గొడవపడి కొట్టి తనను కులం పేరుతో తిట్టినట్టు దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు. కేసును అనకాపల్లి డీఎస్పీ వి.సుబ్బరాజు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి : నలుగురు అరెస్టు

కశింకోట, ఫిబ్రవరి 24 : మండల కేంద్రంలోని శివారు కొబ్బరితోటల్లో పేకాట శిబిరంపై పోలీసులు శనివారం సాయంత్రం దాడి చేశారు. ఎస్‌ఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో చేపట్టిన ఆ దాడుల్లో నలుగురు జూదరులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.4,750లు నగదు, 52 పేకముక్కలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

మద్యం బాటిళ్లు తరలిస్తున్న ఇద్దరిపై కేసు

కశింకోట, ఫిబ్రవరి 24 : మండలంలోని ఎన్‌జీ.పాలెం, పల్లపు సోమవరం గ్రామాల మీదుగా మద్యం క్వార్టర్ బాటిళ్లు తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుళ్లు సూర్యారావు, మల్లేశ్వరి శనివారం తెలిపారు. ఆయా గ్రామాల్లో మద్యం బెల్టు షాపుల ద్వారా విక్రయించేందుకు 24 మద్యం క్వార్టర్ బాటిళ్లు తీసుకువెళుతున్నారన్నారు. న్‌జీపాలెం గ్రామానికి చెందిన పరవాడ అప్పారావు, పల్లపు సోమవరం గ్రామానికి చెందిన రాయుడు సంజీవ్ పట్టుబడ్డారన్నారు. ఈ మేరకు వారిద్దరిపై కేసు నమోదు చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని వారు చెప్పారు.

బొద్దపువానిపాలెంలో...

పరవాడ : మండలంలోని బొద్దపువానిపాలెం గ్రామానికి చెందిన బొండా శ్రీనివాసరావును ఎనిమిది మద్యం బాటిళ్లతో శనివారం రాత్రి పట్టుకున్నట్టు పరవాడ సీఐ బాలసూర్యారావు తెలిపారు. ప్రభుత్వ మద్యం దుకాణంలో వీటిని కొనుగోలు చేసి తీసుకువెళుతుండగా తనిఖీ చేయగా పట్టుబడినట్టు చెప్పారు. ఈ మేరకు శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసినట్టు సీఐ బాలసూర్యారావు తెలిపారు.

ఫ్లయింగ్ స్క్వాడ్, సర్వేలెన్సు బృందాలకు శిక్షణ

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 24 : కొద్ది రోజుల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ సర్వేలెన్స్ బృందాలకు శనివారం కలెక్టరేట్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. హెడ్‌కానిస్టేబుల్స్, ఏఎస్‌ఐలు, డిప్యూటీ తహసీల్దార్లు, ఫ్లయింగ్‌స్క్వాడ్ , సర్వేలెన్స్ బృందాలకు రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జయంతి పలు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ అప్పలనాయుడు, ఎలక్షన్ సెల్ సీఐ కుమారస్వామి పాల్గొన్నారు.

మహిళలు మరింత పురోగతి సాధించాలి

» సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళా సాధికారిత దిశగా ఎదగాలని సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పీఎస్ నరసింహ ఆకాంక్షించారు. దేశంలో తొలి మహిళా న్యాయవాది ఫాతిమా బీబీ భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టులో తొలి జడ్జిగా పనిచేసిన సంగతిని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ఫెడరేషన్ ఆఫ్ వుమెన్ లాయర్స్ ఆఫ్ ఏపీ, విశాఖపట్నం ఆధ్వర్యంలో గ్రీన్‌పార్క్ హోటల్‌లో 'మహిళా సాధికారిత-రాజ్యాంగ ఆవశ్యకత' అనే అంశంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో అడుగుపెట్టిన మహిళలు తమను తాము నిరూపించుకున్నారన్నారు. ఆధునిక యుగంలో స్త్రీలు మరింత పురోగతి సాధించాలని సూచించారు. మహిళా న్యాయవాదులు భవిష్యత్తులో మరింత ఎత్తుకు ఎదగాలని ఆకాంక్షించారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ మహిళా సాధికారితపై ఈ తరహా సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మహిళా ఫెడరేషన్ విజయాలతో కూడిన సీడీని ముఖ్య అతిథులు ఆవిష్కరించారు. అనంతరం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్, హైకోర్టు జడ్జిలు జస్టిస్ బీఎస్ భానుమతి, జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, విశాఖపట్నం జిల్లా జడ్జి ఆలపాటి గిరిధర్, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ రాంబాబు, విశాఖపట్నం జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి యు.దుర్గాప్రసాదరావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ, తదితరులు పాల్గొన్నారు. సదస్సుకు సీనియర్ న్యాయవాది డి.అరుణకుమారి అధ్యక్షత వహించగా, ఫెడరేషన్ ఆఫ్ వుమెన్ లాయర్స్ రాష్ట్ర ప్రెసిడెంట్ కొప్పాక అరుణ, వైస్ ప్రెసిడెంట్ డి.మంజులత, ఎన్‌ఈసీ మెంబర్ పి.హేమామాలిని, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

మాఘ పౌర్ణమికి పోటెత్తిన భక్తజనం



భక్తులతో కిటకిటలాడుతున్న రేవుపోలవరం సముద్రతీరం



పెంటకోట సముద్ర తీరంలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

కిటకిటలాడిన పూడిమడక, రేవుపోలవరం, వాడపాలెం, ముత్యాలమ్మపాలెం తీరాలు

» ఆలయాల్లో ప్రత్యేక పూజలు

» పోలీసులు గట్టి బందోబస్తు

» స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాలు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 24:

మాఘ పౌర్ణమి పుణ్య స్నానాలు ఆచరించేందుకు పూడిమడక, రేవుపోలవరం, వాడపాలెం, ముత్యాలమ్మపాలెం తీరాలు భక్తులతో కిటకిటలాడాయి. శుక్రవారం రాత్రి పూడిమడకలో జాగారంతోపాటు జాతర ఘనంగా జరిగింది. శనివారం ఉదయం భక్తులు సముద్ర స్నానాలు చేసి తీరంలో గల లక్ష్మీ వేణుగోపాల సహిత జగన్నాథస్వామిని దర్శించుకున్నారు. సమద్ర స్నానాలనంతరం కొమ్ముదేవర్లు, జంగమ దేవర్లు భక్తులను దీవించారు. ఉదయం 11 గంటల దాటిన తర్వాత ఇసుక వేస్తే రాలని జనం పూడిమడకకు చేరుకొని పుణ్య స్నానాలు చేసి దైవ దర్శనం చేసుకున్నారు. శుక్రవారం రాత్రి జాతర సందర్భంగా పూడిమడక సముద్ర తీరం ఇసుకవేస్తే రాలనంత జనంతో నిండిపోయింది. ఈ ఏడాది తీరంలో భారీగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. సెజ్‌లో గల కర్మాగారాల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు తెల్లవార్లు ఎంజాయ్ చేశారు. తీరంలో మెరైన్ పోలీస్ సిబ్బంది గట్టి నిఘా ఏర్పాటు చేశారు. రెండు పడవల్లో సిబ్బంది సముద్రంలో పహారా కాశారు. తీరంలో పోలీసులు అవుట్‌పోస్ట్ ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు భక్తులకు మైక్ ద్వారా సూచనలిచ్చారు. అచ్యుతాపురం పీహెచ్‌సీ సిబ్బంది ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

జనసంద్రంలా వాడపాలెం తీరం

రాంబిల్లి: మాఘపౌర్ణమి జాతర సందర్భంగా శనివారం వాడపాలెం సముద్ర తీరంలో వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు.



అచ్యుతాపురం : జంగమ దేవర దీవెనలందుకుంటున్న భక్తులు

అనంతరం గంగాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రాంబిల్లి సీఐ కె.లక్ష్మణరావు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. సముద్రతీరంలో రాంబిల్లి పీహెచ్‌సీ సిబ్బంది వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. కాగా లోవపాలెం, వెంకయ్యపాలెం, వాడనడర్సాపురం, కొత్తపట్నం సముద్రతీరాల్లో భక్తులు మాఘస్నానాలు ఆచరించారు.

కిటకిటలాడిన రేవుపోలవరం తీరం

ఎస్.రాయవరం: మాఘ పౌర్ణమి పురస్కరించుకొని రేవుపోలవరం తీరం శనివారం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి పక్కనే కొండపై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీమాధవస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. స్నానాలు ఆచరించిన తర్వాత బ్రాహ్మణులు, జంగమ దేవర్ల ఆశీస్సులు అందుకున్నారు. సముద్రంలో ప్రమాదకరమైన ప్రదేశాల వద్దకు ప్రజలు వెళ్లకుండా పోలీసులు చర్యలు



రాంబిల్లి: స్నానాలు చేసేందుకు వస్తున్న భక్తులతో కిక్కిసిరిన రోడ్డు

తీసుకున్నారు. రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు లక్ష్మీమాధవస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సముద్రతీరంలో తీర్థం జరిగింది. నర్సీపట్నం డీఎస్పీ వెంకట్రామయ్య తన సిబ్బందితో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దగ్గరుండి చర్యలు తీసుకున్నారు. సత్యసాయి సేవ సంఘంతో పాటు ముసలమ్మ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బంగారు చిట్టి భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. తీరంలో సుమారు 60 వేల మంది భక్తులు పుణ్య స్నానాలు చేశారని సీఐ అప్పన్న తెలిపారు.

పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు

పాయకరావుపేట రూరల్: మాఘ పౌర్ణమి సందర్భంగా మండలంలోని పెంటకోట, రాజవరం, వెంకటనగరం, పాల్మన్‌పేట సముద్రతీరాలలో మాఘ పౌర్ణమి పుణ్య స్నానాలు ఆచరించేందుకు భక్తులు పోటెత్తారు. పాయకరావుపేట, తుని, కోటనందూరు తదితర మండలాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో చేరుకుని సముద్ర స్నానాలు ఆచరించారు. పెంటకోటలో సముద్ర స్నానాలకు వచ్చే భక్తులకు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు అభిమానులు మజ్జిగ పంపిణీ చేశారు.



లక్ష్మీమాధవ స్వామిని దర్శించుకుంటున్న గొల్ల బాబూరావు

ముత్యాలమ్మపాలెం తీరానికి పోటెత్తిన భక్తజనం

పరవాడ: ముత్యాలమ్మపాలెం తీరం భక్తజనంతో పోటెత్తింది. శనివారం మాఘ పౌర్ణమి పురస్కరించుకుని పుణ్య స్నానాలు అనంతరం మాధవస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయితే పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ముత్యాలమ్మపాలెం జంక్షన్ నుంచి తీరానికి వెళ్లే రహదారి భక్తులతో కిక్కిరిసిపోయింది. తీరంలో శుక్రవారం రాత్రి మాధవస్వామి తీర్థం ఘనంగా జరిగింది. మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి, మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు, సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు, ఎంపీటీసీ సభ్యులు అర్జిల్లి దేవి, సూరాడ బంగార్రాజు, ఉత్సవ కమిటీ ప్రతినిధులతోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. తీర్థం సందర్భంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డీఎస్పీ కేవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో పరవాడ సీఐ బాల సూర్యారావు సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు. జాతరను పురస్కరించుకుని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఆర్థిక సాయంతో తీరంలో శనివారం ఏర్పాటు చేసిన అల్పాహారం కార్యక్రమాన్ని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు ప్రారంభించారు. సుమారు ఐదు వేల మంది భక్తులకు అల్పాహారాన్ని స్వీకరించారు.



పరవాడ : ముత్యాలమ్మపాలెం తీరంలో మాఘ స్నానాలు చేస్తున్న భక్తులు

అనకాపల్లిలో వైశ్యరాజు జ్యూయలర్స్ షోరూం ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న రమేష్

అనకాపల్లిటౌన్, ఫిబ్రవరి 24: అనకాపల్లిలో వైశ్యరాజు జ్యూయలర్స్ షోరూం శనివారం ప్రారంభమైంది. ఈ షోరూంను గుంపిన రమేష్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కొణతాల రాజేంద్ర, వీఎస్ నూకరాజు, కోరుకొండ బుచ్చిరాజు హాజరయ్యారు. ఎంవీపీ బిల్డర్స్ అండ్ ఎస్టేట్స్ ప్రతినిధి జామి భోజరాజు మొదటి కొనుగోలు చేశారు. విభిన్నమైన జ్యూయలరీ డిజైన్లు, విస్తృతశ్రేణి కలెక్షన్లతో అన్ని రకాల బంగారు ఆభరణాలకు ప్రారంభోత్సవ ఆఫర్‌గా ఫ్లాట్ ఆరు శాతం తరుగు ఇచ్చారు. బంగారం ఎక్స్ఛేంజ్‌పై అన్ని రకాల బంగారు ఆభరణాలను పొందవచ్చునని వైశ్యరాజు జ్యూయలర్స్ డైరెక్టర్ వైశ్యరాజు నరేష్‌రాజు తెలియజేశారు. అలాగే సిల్వర్ ఆర్టికల్స్ కొనుగోలుపై కిలోకి రూ.10వేలు తగ్గింపు, ఈ ఆఫర్ తొమ్మిది గ్రాములు పైబడిన బంగారు ఆభరణాలపై వర్తించనున్నారు. ప్రతి ఒక్కరూ ఈ ప్రారంభోత్సవ ఆఫర్‌ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైశ్యరాజు జ్యూయలర్స్ చైర్మన్ వైశ్యరాజు పాల్గుణరాజు, డైరెక్టర్లు వైశ్యరాజు భద్రగిరిరాజు, వైశ్యరాజు కిరణ్‌కుమార్‌రాజు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు, పాడి వృద్ధిపై దృష్టి

» జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 24: ప్రత్యామ్నాయ పంటల సాగు, పాడి అభివృద్ధిపై రైతులకు సహాయ సహకారాలు అందజేయాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతూ ధాన్యం సేకరణ ఇప్పటి వరకు 55 శాతం చెల్లించగా మిగిలిన మొత్తాన్ని వేగంగా చెల్లించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా మామిడి, జీడిమామిడి పంటలకు అధిక దిగుబడి వచ్చేందుకు అవసరమైన సాగు పద్ధతులను తెలియజేయాలన్నారు. వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ చిక్కాల రామచంద్రరావు మాట్లాడుతూ తృణధాన్యాలు ఎక్కువగా సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వేసవిలో పశుగ్రాసం కొరత లేకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం 'చిరు ధాన్యాలతో వంద రకాల వంటలు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

పల్స్ పోలియో విజయవంతం చేయాలి

అనకాపల్లి కలెక్టరేట్: వచ్చే నెల మూడో తేదీన నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. శనివారం పల్స్ పోలియోపై అధికారులతో నిర్వహించిన వెబెక్స్‌లో ఆయన మాట్లాడారు. అధికారుల సమన్వయంతో జిల్లాలో 0-5 సంవత్సరాల వయసు గల పిల్లలకు పోలియో చుక్కలను వేయాలన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్ మాట్లాడుతూ జిల్లాలో 1409 బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. డీపీవో శిరీషారాణి, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

పెరుగుతున్న జనుము విస్తీర్ణం

» ఏడీఆర్ డాక్టర్ జగన్నాథరావు

అనకాపల్లి అగ్రికల్చర్, ఫిబ్రవరి 24 : జనుము విస్తీర్ణం ఇటీవల కాలంలో గణనీయంగా పెరుగుతోందని, రబీలో జనుము, నువ్వు, మొక్కజొన్నను రైతులు లాభసాటిగా పండిస్తున్నారని అనకాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ పీవీకే జగన్నాథరావు అన్నారు. శనివారం పరిశోధనా స్థానంలో జరిగిన జిల్లా వ్యవసాయ సమీక్ష సమావేశానికి అధ్యక్షత వహించారు. వ్యవసాయ ప్రతినిధి శ్రీధర్ వర్షాభావ పరిస్థితులు పంటల దిగుబడిని బాగా దెబ్బతీస్తున్నాయన్నారు. ఈ ఏడాది రబీ విస్తీర్ణం కూడా తగ్గిందన్నారు. కొక్కిరాపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎ.అప్పలస్వామి మాట్లాడుతూ వైఎల్ఎం-66 నువ్వురకం ఎకరానికి 8 క్వింటాళ్ల దిగుబడినిస్తూ రైతులకు మంచి ఆదాయాన్నిస్తోందన్నారు. ఉద్యాన శాఖ సహసంచాలకులు ప్రభాకరరావు, శాస్త్రవేత్తలు డాక్టర్ కేవీ.రమణమూర్తి, డాక్టర్ విశాలాక్షి, డాక్టర్ రామలక్ష్మి, డాక్టర్ ఉమామహేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.

నేడు గ్రూప్-2 స్క్రీనింగ్ టెస్ట్

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 24 : జిల్లాలోని ఆదివారం జరగనున్న గ్రూప్-2 స్క్రీనింగ్ టెస్ట్‌కు అన్ని ఏర్పాట్లు చేశామని జాయింట్ కలెక్టర్ జాహ్నవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం పదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ పరీక్ష జరుగుతుందని, పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు సెల్‌ఫోన్లు, గాడ్జెట్స్, ఎటువంటి యంత్ర పరికరాలు పరీక్షా కేంద్రాలలోకి అనుమతించబడవని స్పష్టం చేశారు. సెల్‌ఫోన్లు, గాడ్జెట్స్, ఇతర యంత్ర పరికరాలు పరీక్షా కేంద్రాల వెలుపల భద్రపరుచుకోవాల్సిందిగా ఆమె సూచించారు.

విమ్స్‌లో అంకాలజీ, న్యూరాలజీ సేవలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో కేన్సర్, బ్రెయిన్ స్ట్రోక్ విభాగాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ రెండు విభాగాలను శనివారం ఉదయం విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తగా మెడికల్ అంకాలజీ, సర్జికల్ అంకాలజీ, న్యూరాలజీ విభాగాలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. కేన్సర్ రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు సర్జికల్ అంకాలజీకి ఇద్దరు, మెడికల్ అంకాలజీకి ఇద్దరు వైద్యులను నియమించామన్నారు. అధిక ఒత్తిడి కారణంగా బ్రెయిన్ స్ట్రోక్ బారినపడిన రోగులకు రూ.50 వేలు విలువజేసే ఇంజెక్షన్‌ను ఉచితంగా ఇవ్వనున్నట్టు డైరెక్టర్ తెలిపారు. స్ట్రోక్ వచ్చిన మూడు నుంచి నాలుగు గంటల వ్యవధిలో ఈ ఇంజెక్షన్ తీసుకుంటే వేగంగా కోలుకుంటారని ఆయన స్పష్టం చేశారు. త్వరలో ఆస్పత్రిలో మరిన్ని విభాగాలను ఏర్పాటు చేస్తామని ఆయన వివరించారు.



వేంకటేశ్వరస్వామి విగ్రహావిష్కరణలో పాల్గొన్న భక్తులు

వైభవంగా వేంకటేశ్వరస్వామి విగ్రహావిష్కరణ

పాడేరు రూరల్, ఫిబ్రవరి 24: జిల్లా కేంద్రం పాడేరులోని పురాతన శైవక్షేత్రం ఉమానీలకంఠేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం ఉదయం లక్ష్మీపద్మావతి సమేత వైభవ వేంకటేశ్వరస్వామి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల సత్యసీతారామస్వామి, మోదకొండమ్మ ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యం, వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య కార్యక్రమం జరిగింది. స్వామివారి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, రమాదేవి దంపతులు మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో అనేక దేవతామూర్తుల విగ్రహాలు ఉన్న నేపథ్యంలో లోక కల్యాణం కోసం భక్తులకు కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామి దర్శనం కల్పించాలన్న సంకల్పంతో విగ్రహావిష్కరణ చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్‌పర్సన్ తమర్భ నరసింగరావు, భాగ్యలక్ష్మి దంపతులు, విగ్రహ దాతలు ఉప్పల వెంకటరత్నం, వైదేహి దంపతులు, పంచాయతీ సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, ఉప సర్పంచ్ బూరెడ్డి రామునాయుడు, వైస్ ఎంపీపీ గంగపూజారి శివకుమార్, ఆధ్యాత్మిక సేవా బృంద సభ్యులు, మహిళా సేవా బృందం, వ్యాపార సంఘ ప్రతినిధులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం



లోతేరు వారపు సంతలో ప్రచారం చేస్తున్న నాయకులు

అరకులోయ, ఫిబ్రవరి 24: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని బీజేపీ మండల అధ్యక్షుడు ఎస్.రామచంద్రరావు చెప్పారు. మండలంలోని మారుమూల లోతేరు, మాదాల, బొండాం తదితర పంచాయతీ పరిధిలో శనివారం బీజేపీ ప్రజాపోరు యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి పనులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. గిరిజన మోర్చా కన్వీనర్ కురుసా పార్వతమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక, మైనింగ్ మాఫియా దోపిడీలు తప్పితే గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించిన దాఖలాలు లేవన్నారు. గ్రామ పంచాయతీలకు కేంద్రం మంజూరు చేస్తున్న నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లిస్తున్నదని, అభివృద్ధికి వెచ్చించడం లేదని చెప్పారు. దళితులు, గిరిజనులు, ఉద్యోగులు, ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు పెట్టడం, దాడులు చేయడం తప్ప వైసీపీ ప్రభుత్వం ప్రజలకు మేలు చేసిందేమీ లేదని ఆమె ఆరోపించారు. ఈ అరాచక ప్రభుత్వాన్ని సాగనంపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రవికుమార్, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డొంబునాయుడు, మండల ప్రధాన కార్యదర్శి బలరాం, తదితరులు పాల్గొన్నారు.

పాడేరులో వైసీపీ నేతల భారీ ర్యాలీ

పాడేరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పాడేరులో వైసీపీ శ్రేణులు శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా తలారిసింగి వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ, నాయకులు ఎస్‌వీ.రమణమూర్తి, కె సురేశ్‌కుమార్, కె.కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం పనులు వేగవంతం

... 5వ పేజీ తరువాయి



డౌనూరు పాఠశాలలో విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న డైరెక్టర్ మురళి

జారీ చేయాలని డిప్యూటీ డైరెక్టర్ కొండలరావును ఆదేశించారు. అక్కడ నుంచి డౌనూరు బాలుర పాఠశాలను సందర్శించి మ్యాప్‌పాయింటింగ్‌లో విద్యార్థులు సరైన సమాధానాలు చెప్పకపోవడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సోషల్ ఉపాధ్యాయుడిని బోర్డుపై ఇండియా మ్యాప్ వేయమని డైరెక్టర్ చెప్పగా ఆయన సరైన పద్ధతిలో వేయలేకపోయారు. అలాగే విద్యార్థినులకు పాఠం చెప్పే పరిస్థితిలో ఆయన లేకపోవడంతో ఆయన మద్యం సేవించి వుంటాడని డైరెక్టర్ అనుమానం వ్యక్తం చేశారు. దీంతో సోషల్ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని డైరెక్టర్ డీడీని ఆదేశించారు. సాయంత్రం డీడీ కొండలరావు విలేకరులతో మాట్లాడుతూ లంబసింగి సోషల్ ఉపాధ్యాయురాలు గోల్డ్‌కి షోకాజు నోటీసు జారీ చేశామన్నారు. అలాగే డౌనూరు సోషల్ ఉపాధ్యాయుడు రాజుబాబుకి సస్పెండ్ ఉత్తర్వులు జారీ చేశామని, అతనిపై కొయ్యూరు ఏటీడబ్ల్యూవోకి విచారణ అధికారిగా నియమించామన్నారు.

గిరిజన విద్యార్థినుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం

గిరిజన విద్యార్థినుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ జేవీ మురళి తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ గిరిజన సంక్షేమశాఖ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించామని, వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించామన్నారు. గిరిజన విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తూ ప్రత్యేక వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. సికిల్ సెల్ ఎనీమియా, హెచ్‌బీ పరీక్షలు చేయిస్తున్నామని, బాధితులకు మెరుగైన చికిత్స అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈ చాణిక్యరావు, ఏటీడబ్ల్యూవో జయ నాగలక్ష్మి, హెచ్‌డబ్ల్యూవో పసుపులేటి వినాయకరావు పాల్గొన్నారు.

అనకాపల్లి జనసేన అభ్యర్థిగా కొణతాల

... 5వ పేజీ తరువాయి

పనిచేశారు. 2014 ఎన్నికల అనంతరం కొణతాల వైఎస్‌ఆర్‌సీపీకి రాజీనామా చేశారు. అప్పటి నుంచి ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటూ ఉత్తరాంధ్ర సమస్యలపై సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. జనవరి 17న హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్‌తో భేటీ అయ్యారు. ఆ తరువాత విజయవాడలో జనసేన సభ్యత్వాన్ని తీసుకున్నారు.

విశాఖ జిల్లాలో ఇద్దరి పేర్లు ప్రకటన

... 5వ పేజీ తరువాయి

పోటీ చేయగా తాజాగా ఐదోసారి ఆయనకు టికెట్ లభించింది. విశాఖ తూర్పు నుంచి ఇప్పటివరకు మూడుసార్లు పోటీ చేసి విజయం సాధించిన వెలగపూడి నాలుగోసారి అదే స్థానం నుంచి బరిలో దిగనున్నారు. విశాఖ జిల్లాలో మిగిలిన ఐదు సీట్లకు సంబంధించి టీడీపీ, జనసేన మధ్య ఇంకా స్పష్టత రాకపోవడంతో అభ్యర్థులను ప్రకటించలేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

విద్యార్థుల అనారోగ్యానికి అంతుచిక్కని కారణాలు

» గిరిజన సంక్షేమ విద్యా శాఖ డీడీ కొండలరావు

కొయ్యూరు, ఫిబ్రవరి 24: విద్యార్థుల అనారోగ్యం బారిన పడడానికి కారణాలు అంతు చిక్కడం గిరిజన సంక్షేమ విద్యా శాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు తెలిపారు. కొయ్యూరు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో కొన్ని రోజులుగా విద్యార్థులు జ్వరాల బారిన పడుతుండడంతో శనివారం పాఠశాలను సందర్శించారు. మోనూ అమలు, విద్యార్థులకు కల్పించిన వసతులను పరిశీలించారు. పాఠశాలలో వసతులన్నీ బాగున్నా విద్యార్థులు అనారోగ్యం బారిన ఎందుకు పడుతున్నారో అంతు చిక్కటం లేదని ఈ సందర్భంగా డీడీ చెప్పారు. వైద్య నిపుణులతో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం అనారోగ్యం బారిన పడిన విద్యార్థులను కార్పొరేట్ ఆసుపత్రులకు తరలించి వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకున్నట్టు ఆయన వివరించారు. శనివారం నిర్వహించిన తనిఖీల ద్వారా విద్యార్థుల ఆరోగ్యం కుదుటపడినట్టు వైద్యాధికారి మనోగ్న గుర్తించారని, తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డీడీ తెలిపారు.



విద్యార్థుల ఆరోగ్య తనిఖీలను పరిశీలిస్తున్న డీడీ కొండలరావు

పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు

వచ్చే నెలలో జరగనున్న పదో తరగతి పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్టు గిరిజన సంక్షేమ విద్యా శాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు తెలిపారు. శనివారం మండల పర్యటనకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఉత్తీర్ణత శాతం సాధనకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో 49 బాలికల ఆశ్రమ పాఠశాలల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామన్నారు. జిల్లాలోని వివిధ ఆశ్రమ పాఠశాలల్లో ఎస్టీటీలుగా పనిచేస్తున్న 52 మందికి స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి కల్పించేలా చర్యలు తీసుకున్నామని డీడీ తెలిపారు. ఇప్పటికే అర్హులను గుర్తించి నివేదిక తయారు చేశామన్నారు. డీడీ వెంట ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్ పాల్గొన్నారు.

మత్స్యగుండంలో శివరాత్రి ఉత్సవాలకు పక్కా ఏర్పాట్లు

» సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారి చక్రవర్తి

పాడేరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం మత్స్యగుండంలో మహా శివరాత్రి మహోత్సవానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారి టి.చక్రవర్తి సూచించారు. మత్స్యగుండంలో మార్చి 7, 8, 9 తేదీల్లో నిర్వహించే శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై సబ్ కలెక్టర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే ఉత్సవాల ప్రాంగణంలో తాగునీటి సదుపాయాలు కల్పించాలని, నిత్యం పారిశుధ్య పనులు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖల అధికారులకు ఆదేశించారు. అలాగే విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ట్రాన్స్‌కో అధికారులు చర్యలు చేపట్టాలని, పటిష్ఠ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. మూడు రోజులు భక్తులకు రవాణా సౌకర్యం కల్పించేందుకు 15 బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. అగ్ని ప్రమాద నివారణ పరికరాలు ఏర్పాటు చేయాలని, పాడేరు మండలం చింతలవీధి కూడలి నుంచి హుకుంపేట మండలం మఠం గ్రామం వరకు మెయిన్‌రోడ్డుకు అవసరమైన మరమ్మతులు చేయాలని ఆర్‌అండ్‌బీ శాఖాధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సాయినవీన్, హుకుంపేట ఎంపీడీవో ఆర్.వెంకటరావు, ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు, డీఎల్‌పీవో పీఎస్..కుమార్, ట్రాన్స్‌కో డీఈ మల్లేశ్వరరావు, సర్పంచ్ శాంతకుమారి, ఆలయ కమిటీ ప్రతినిధులు టి.అప్పారావు, ఎం.సూర్యనారాయణనాయుడు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఎం.గోపాలరావు, ప్రధాన కార్యదర్శి పి.మత్స్యకొండబాబు, ఉపాధ్యక్షుడు వి.ఈశ్వరరావు, కోశాధికారి టి.భీంబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





సమావేశంలో పాల్గొన్న ఉత్సవ, ఆలయ కమిటీ ప్రతినిధులు, అధికారులు... (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న రెవెన్యూ డివిజన్ ఏవో చక్రవర్తి

'ప్రేమామృత సేవా నిలయం' ప్రారంభోత్సవం

» అధిక సంఖ్యలో హాజరైన భక్తులు

హుకుంపేట, ఫిబ్రవరి 24: మండలంలో గడుగుపల్లి గ్రామంలో సత్యసాయి ప్రేమామృత సేవా నిలయం ప్రారంభోత్సవం శనివారం ఘనంగా జరిగింది. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో 2010 నుంచి తమ ట్రస్ట్ ద్వారా సేవలు అందిస్తున్నామన్నారు. ప్రధానంగా మారుమూల గిరిజన పల్లెలకు తాగునీటి సదుపాయాల కల్పనకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే 550 పల్లెలకు విద్యుత్ అవసరం లేకుండా ప్రజలకు తాగునీటిని అందించే పథకాలను నిర్మించామన్నారు. అలాగే తమ సేవలను మరింతగా విస్తరించాలనే లక్ష్యంతోనే గడుగుపల్లి గ్రామంలో ప్రేమామృత సేవా నిలయాన్ని స్థాపించామన్నారు. ఈ సందర్భంగా సేవా నిలయం ప్రాంగణంలో హోమాల ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులతో భారీ ఊరేగింపు, నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో గడుగుపల్లి ప్రాంతంలో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో సత్యసాయి సేవా ట్రస్టు ప్రతినిధులు నమిశ్ పాండ్య, ఎస్.కోటేశ్వరరావు, ఆర్.లక్ష్మణరావు, గణేశ్, సేవా సమితి ప్రతినిధులు, అధిక సంఖ్యలో గిరిజన భక్తులు పాల్గొన్నారు.



సేవా నిలయం ప్రారంభోత్సవంలో హోమం చేస్తున్న అర్చకులు

పవర్ కెనాల్ నిర్వహణ పనులకు ప్రతిపాదన

జెన్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ ప్రశాంత్‌కుమార్

సీలేరు, ఫిబ్రవరి 24: సీలేరు కాంప్లెక్సు పరిధిలోని డొంకరాయి పవర్ కెనాల్ నిర్వహణ పనులు చేపట్టేందుకు అనుమతులు కోరుతూ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని జెన్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ కేకేవీ ప్రశాంతకుమార్ తెలిపారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి నీటిని సరఫరా చేసేందుకు డొంకరాయి జలాశయం నుంచి ఫోర్‌బే వరకు 16 కిలోమీటర్ల మేరకు నిర్మించిన పవర్ కెనాల్ ద్వారా నీటిని విడుదల చేస్తామన్నారు. ఈ కెనాల్ నిర్మించి 50 ఏళ్లు పైబడడంతో జెన్‌కో అధికారులు, సిబ్బందితో నిత్యం పెట్రోలింగ్ చేస్తారన్నారు. గతంలో రెండేళ్లకోసారి కెనాల్ నిర్వహణ పనులు జరిగేవని, డ్యాం అండ్ సేఫ్టీ అధికారుల సూచనల మేరకు ఇటీవల ప్రతీ ఏటా చేసేవారన్నారు. ప్రస్తుతం గోదావరి డెల్టా రబీ పంటలకు నీటి అవసరాల నిమిత్తం సీలేరు కాంప్లెక్సులో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయడంతో కెనాల్ ద్వారా నీటి విడుదల నిలుపదల చేయడం వల్ల నిర్వహణ పనులను నిర్వహించడానికి కెనాల్‌ను సర్వే చేసి అంచనా వ్యయంతో కూడిన ప్రతిపాదనలు పంపించామన్నారు. అనుమతులు మంజూరు కాగానే ఒకటి, రెండు రోజుల్లో కెనాల్ రీచ్-1, 2లో నిర్వహణ పనులను ప్రారంభిస్తామని తెలిపారు.

నిబంధనలు పాటించకపోతే కేసులు: ఎంపీడీవో

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 24: వ్యాపారులు నిబంధనలు పాటించకపోతే కేసులు నమోదు చేస్తామని ఎంపీడీవో సాయికిరణ్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పలు దుకాణాల్లో శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. నిత్యావసర సరకులు, కాస్మోటిక్స్, ఇతర వస్తువులను పరిశీలించారు. నాలుగు దుకాణాల్లో కాలం చెల్లిన సరకులను గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల్లో కాలం చెల్లిన, నాసిరకం సరకులను విక్రయించరాదని ఆదేశించారు. దుకాణాల ఆవరణలో విధిగా ధర పట్టికలను ఏర్పాటు చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వి.చిన్ని పాల్గొన్నారు.

గిరి పల్లెల్లో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

పాడేరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఇరడాపల్లి పంచాయతీలోని ఎగువ సొలములు, దిగువ సొలములు, బొడ్డాపుట్టు, సంపాలు గ్రామాల్లో శనివారం 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నేత కొట్టగుళ్లి సుబ్బారావు మాట్లాడుతూ చంద్రబాబుతోనే గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. వైసీపీ నిరంకుశ పాలనకు చరమగీతం పాడి, గిరిజన గ్రామాల అభివృద్ధికి అందరూ సహకరించాలని ఆయన కోరారు. ఇంటింటికీ వెళ్లి ఆరు గ్యారెంటీ పథకాలను గిరిజనులకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వర్తన పిన్నయ్యదొర, బాలయ్య, ఈశ్వరరావు, భాస్కరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఎగువసొలములులో మాట్లాడుతున్న టీడీపీ నేత సుబ్బారావు

మన్యంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి

» రాజకీయ పార్టీల అభిప్రాయాలను తీసుకున్న సబ్ కలెక్టర్

రంపచోడవరం, ఫిబ్రవరి 24: సాధారణ ఎన్నికల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై అధికారులు దృష్టిసారించారు. రెవెన్యూ-పోలీసు శాఖలు ఈ మేరకు సమీక్షలు నిర్వహించుకుని అత్యంత సమస్యాత్మకంగా, మావోయిస్టుల దుశ్చర్యలకు అనుకూలంగా ఉన్న మూడు పోలింగ్ కేంద్రాలను రంపచోడవరం సెగ్మెంట్లో గుర్తించారు. ఈ మేరకు రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంతకుమార్ శనివారం తన కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీలతోనూ సమావేశం నిర్వహించి ఆయా కేంద్రాలపై చర్చించారు. మావోయిస్టుల కారణంగా అత్యంత సమస్యాత్మకంగా వై.రామవరం మండలం బొడ్డగండి, చింతూరు మండలం పారకొండ, సుద్దగూడెం పోలింగ్ కేంద్రాలు గుర్తించారు. ఈ కేంద్రాలలో ఎన్నికలు నిర్వహించడం భారీ బందోబస్తు చర్యలతో కూడుకున్నది కావడం, అక్కడి నుంచి బ్యాలెట్ యంత్రాలను తరలించడం వంటి అంశాలు ప్రమాదకరంగా గుర్తించిన విషయాన్ని ప్రస్తావించారు. ఇక పోలవరం ప్రాజెక్టు కారణంగా గోదావరి తీరం నుంచి నిర్వాసితులను ఇప్పటికే తరలించడంతో కొండమొదలు తదితర ప్రాంతాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలను కూడా తరలించే అంశాన్ని కూడా చర్చించారు.

తొలి జాబితాలోనే దొన్నుదొరకు చోటు

... 5వ పేజీ తరువాయి

అందుకు భిన్నంగా పెండింగ్‌లో పెట్టారు. ప్రస్తుతం మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. అయితే పాడేరు అసెంబ్లీ స్థానం తమకు కేటాయించాలని జనసేన, బీజేపీ సైతం కోరుతుండడంతో పొత్తుల అనంతరం ఆ స్థానంపై నిర్ణయం తీసుకోవాలనే ఆలోచనతో తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం ఉంది. అందువల్ల రెండో జాబితాలో గాని పాడేరు అసెంబ్లీ అభ్యర్థిపై స్పష్టత వచ్చే అవకాశాలు కనిపించడం లేదు.

అరకులోయ పార్లమెంట్‌లో నాలుగు అసెంబ్లీ అభ్యర్థుల ప్రకటన

అరకులోయ పార్లమెంట్ స్థానం పరిధిలో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు, అరకులోయ, రంపచోడవరం అసెంబ్లీ స్థానాలు, పార్వతీపురం మన్యం జిల్లాల పరిధిలో పార్వతీపురం, పాలకొండ, కురుపాం, సాలూరు అసెంబ్లీ స్థానాలున్నాయి. వాటిలో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకులోయ అసెంబ్లీ అభ్యర్థిగా సియ్యారి దొన్నుదొరను ప్రకటించారు. పాడేరు, రంపచోడవరం అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సిన ఉంది. అలాగే పార్వతీపురం మన్యం జిల్లాలో సాలూరు అభ్యర్థిగా గుమ్మడి సంధ్యారాణి, పార్వతీపురం బోనెల విజయ్, కురుపాం తోయక జగదీశ్వరిలను అభ్యర్థులుగా ప్రకటించారు. ఈ జిల్లాలో ఇంకా పాలకొండ అసెంబ్లీ స్థానానికి అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది.

టీడీపీ నేతల సంబరాలు

అరకులోయ: అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా దొన్నుదొరను పార్టీ అధిష్ఠానం ప్రకటించడంతో పార్టీ నాయకులు అరకులోయలో శనివారం సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా దొన్నుదొరకు మిఠాయి తినిపించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు శెట్టి బాబూరావు, పార్టీ నాయకులు వంతల నాగేశ్వరరావు, ధన్నేరావు, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



ముంచంగిపుట్టులో సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు

ముంచంగిపుట్టులో...

ముంచంగిపుట్టు: అరకు అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థిగా దొన్నుదొరను ప్రకటించడంపై టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. మండల కేంద్రంలో శనివారం బాణసంచా కాల్చి ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. అందరూ కలసికట్టుగా పనిచేసి దొన్నుదొరను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించి చంద్రబాబుకు గిఫ్ట్‌గా ఇస్తామని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కె.బలరాం, స్టేట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎ.తిరుపతిరావు, కార్యదర్శి కె.జగన్నాయ్, సర్పంచులు వి.లక్ష్మణ్, వి.ధనియా, నాయకులు ఎస్.శంకర్, ఎం.రఘుపతి, ఎం.చిన్నిబాబు, కె.ఉర్ధోవ్, కె.రామూర్తి పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

జర్నలిస్టులపై దాడులు అరికట్టాలి

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 24: జర్నలిస్టులపై దాడులను అరికట్టాలని అరకు పార్లమెంట్ నియోజకవర్గ టీఎస్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి డిమాండ్ చేశారు. పత్రికా కార్యాలయాలు, జర్నలిస్టులపై వైసీపీ మూకలు దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. ఇది వైసీపీ అరాచక పాలనకు నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి జగన్ ప్రోత్సాహంతోనే దాడులు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా ప్రతికా స్వేచ్ఛను కాపాడాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

వర్తకులకు ఉపాధి కల్పించాకే దుకాణాలు తొలగించండి

పెదబయలు, ఫిబ్రవరి 24: వర్తకులకు ఉపాధి కల్పించిన తరువాతే దుకాణాలు తొలగించాలని ఆదివాసీ వర్తకుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు పి.భాస్కరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని రోడ్డుకిరువైపులా ఆర్‌అండ్‌బీ స్థలంలో దుకాణాలు పడగొట్టాలని లోకయుక్త కోర్టు తీర్పుతో వందలాది ఆదివాసీ గిరిజన వర్తకులు, యజమానులు నష్టపోతున్నారని శనివారం మార్కింగ్ చేయడానికి వచ్చిన తహసీల్దార్ రాజమోహనరావు ఎదుట ఆయన వాపోయారు. సంబంధిత ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి దుకాణాల మీదే ఆధారపడి బతుకుతున్న తమకు న్యాయం చేయాలని వర్తకులు ముక్తకంఠంతో కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు రాధాకృష్ణ, జానకిరావు ఉన్నారు.

పంచాయతీలో నిధులు లేక పనులు చేయలేకపోతున్నాం..

అరకులోయ, ఫిబ్రవరి 24: వైసీపీ ప్రభుత్వం పంచాయతీలకు నిధులను కేటాయించడం లేదని, కేంద్రం నుంచి వచ్చే నిధులను సైతం దారి మళ్లించడంతో అభివృద్ధి పనులు చేయలేకపోతున్నామని పెదలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టెలి దాసుబాబు అన్నారు. రెండు రోజుల క్రితం లిట్టిగుడ గ్రామస్థులు గిరిజన సంఘం నేతలతో కలిసి గ్రామానికి పక్కా రహదారి సౌకర్యం కల్పించాలని పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగిన నేపథ్యంలో శనివారం గ్రామాన్ని ఆయన సందర్శించారు. చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో పెదలబుడు పంచాయతీని దత్తత తీసుకున్నారని, ఆ సమయంలో లిట్టిగుడకు పక్కా రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా అప్పటి సర్పంచ్, అధికారులు సకాలంలో పనులు ప్రారంభించలేదని చెప్పారు. ఈ రహదారి నిర్మాణం చేపడతామని చెప్పారు. అలాగే గ్రామంలో పాఠశాల భవనం సైతం శిథిలావస్థకు చేరిందని, ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలను తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మూడు నెలల్లో టీడీపీ/జనసేన ప్రభుత్వం వస్తుందని, అప్పుడు సమస్యలను పరిష్కరించే బాధ్యతను తానే తీసుకుంటానని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గిరిజన సంఘం నేతలు పాల్గొన్నారు

ఓపీఎస్ అమలుచేసే వారికే ఓటు వేయాలి: యూటీఎఫ్

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 24: ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ పథకం (ఓపీఎస్) అమలు చేసే వారికే ఓటు వేయాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో వాల్ పోస్టర్లతో ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో గిరిజనులకు 100 శాతం రిజర్వేషన్ కల్పించిన జీవో నంబరు-3ను అమలు చేసే వారికే తమ ఓటని పోస్టర్లలో పేర్కొన్నారు.

'గిరిజన ఎమ్మెల్యేల అసమర్థతతోనే జీవో-3 అమలుకు ఆటంకం'

చింతపల్లి, ఫిబ్రవరి 24: గిరిజన ఎమ్మెల్యేల అసమర్థత కారణంగానే జీవో నంబరు-3ను సాధించుకోలేకపోతున్నామని భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు అన్నారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ జీవో నంబరు-3ను పునరుద్ధరించే శక్తి సామర్థ్యాలు వైసీపీ ఎమ్మెల్యేల చేతిలో ఉన్నప్పటికీ, ఆ దిశగా అడుగులు వేయడం లేదన్నారు. గిరిజన ఎమ్మెల్యేలు మౌనం వహిస్తే గిరిజనులకు అన్యాయం జరుగుతుందని, లేదంటే వచ్చే ఎన్నికల్లో ప్రతీ నిరుద్యోగి అధికార పార్టీ ఎమ్మెల్యేను గద్దె దించేందుకు పనిచేస్తారని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణ, సభ్యుడు పాంగి సన్యాసిరావు పాల్గొన్నారు.

విద్యార్థినులకు దుస్తుల పంపిణీ

చింతపల్లి, ఫిబ్రవరి 24: మండల కేంద్రంలోని బీసీ వెల్ఫేర్ వసతి గృహం విద్యార్థినులకు చేయూత వారియర్స్ ట్రస్టు ప్రతినిధులు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ డి.రమణ మాట్లాడుతూ వ్యక్తిగత నిధులతో విద్యార్థినులకు ఒక్కొక్క జత నూతన దుస్తులు పంపిణీ చేశామన్నారు. రానున్న రోజుల్లో ట్రస్టు నుంచి వసతి గృహం విద్యార్థినులకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు బిలాస్కర్, సాగిన జగన్, ఉమర్, శివ, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

పరీక్షలపై ఆందోళన వద్దు

జి.మాడుగుల, ఫిబ్రవరి 24: ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులు ఆందోళన లేకుండా పరీక్షలు రాయాలని ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకుడు పి.సూర్యనారాయణ సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ, గురుకుల కళాశాలను శనివారం ఏబీవీపీ నాయకులు సందర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మార్చి నుంచి ప్రారంభం కానున్న పరీక్షల్లో ఒత్తిడికి గురికాకుండా ధైర్యంగా పరీక్షల్లో పాల్గొని ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. తద్వారా తల్లిదండ్రులు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నేత వి.రాజు పాల్గొన్నారు.

జర్జుల సచివాలయ ఉద్యోగులపై ఫిర్యాదు

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 24: మండలంలోని జర్జుల సచివాలయ ఉద్యోగులు విధులకు తరచూ డుమ్మా కొడుతున్నారని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.ఎం.శ్రీను శనివారం ఎంపీడీవో సాయికిరణ్‌కు ఫిర్యాదు చేశారు. విధులకు గైర్హాజరు కావడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పలు రకాల పనులు సకాలంలో జరగడంలేదని తెలిపారు. ఉద్యోగులు నిత్యం అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో హామీ ఇచ్చారు.



ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న గిరిజన సంఘం నేతలు